క్లుప్తంగా

సన్మానం



మురళీధర్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్: పీలేరుకు చెందిన కవి మురళీధర్ రాజుకు ఘన సన్మానం లభించింది. చిత్తూరు జిల్లా రచయితల సంఘం, ఎంవీ కేశవరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సమితిని ఏర్పరచి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసి మురళీధర్‌రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్‌మోహన్, నిర్వాహకులు ఎంవీ శ్రీదర్‌రెడ్డి, గిరధర్, సహదేవనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు:వివేకానంద జయంతిని స్థానిక కోటపల్లె సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం వీ211ఏ పీలేరు వాసవిక్లబ్ గ్రేటర్, వాసవిక పుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ గ్రేటర్, వాసవికపుల్స్ క్లబ్ నాయకులు సోమిశెట్టి సురేష్, అరవింద్ బాబు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్‌లు సీజ్

మదనపల్లె : రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌లను సీజ్‌చేసి పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. మండలంలోని అంకిశెట్టిపల్లె హెచ్ఎన్ఎస్ఎస్ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో అక్రమంగా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం తహసీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఏపీ-03బీడబ్ల్యూ7151, ఏపీ39డీఏ8053, ఏపీ03ఏకే8165, ఏపీ26టీసీ9667 నెంబర్ కలిగిన 4 ట్రాక్టర్లు మట్టి తరలిస్తుండగా సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తాలూకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దాడుల్లో ఆర్ఐ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

శ్రీకోదండ రామస్వామికి ప్రత్యేక పూజలు



రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిరంలో బాలరాముని వార్షికోత్సవంలో భాగంగా అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే గణపతి,శాంతి హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక నిఘా

కలకడ : కలకడ, కేవీపల్లె మండలాల్లో పేకాట, కోడి పందేల స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు కలకడ సీఐ గురునాథ పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు ప్రతి గ్రామంలో సంతోషంగా జరుపుకోవాలన్నారు. పేకాట, కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవన్నారు.

కౌడిన్య స్కాలర్ షిప్‌కు కదిరాయచెర్వు విద్యార్థి ఎంపిక

కలకడ : గ్రామీణ ప్రాంత పేద, ఉత్తమ విద్యార్థులకు అందించే కౌడిన్య స్కాలర్ షిప్ కు కలకడ మండలం కదిరాయచెర్వు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు గౌరవం నాగమణి-చలమయ్యగౌడ్ దంపతుల కుమారుడు సొమ్యనాథ్ ఎంపికయ్యారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అందించే కౌడిన్య స్కాలర్‌షిప్‌ను ఆదివారం గుంటూరులో విద్యార్థులకు అందజేశారు. రూ.5వేల నగదు, ప్రశంస పత్రాన్ని సొమ్యనాథ్‌కు ఆ సంస్థ చైర్మన్ ఎం.వి. నారాయణ అందజేసి అభినందించారు.

బీజేపీ రెండో పట్టణ అధ్యక్షుడిగా పూలనాగరాజు

మదనపల్లె : బీజేపీ రెండో పట్టణ అధ్యక్షుడిగా పూలనాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో రెండో పట్టణ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాజంపేట బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆకులకృష్ణమూర్తి వ్యవహరించగా, ముఖ్యఅతిథి, పరిశీలకుడిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్‌నాయుడు హాజరయ్యారు. సమావేశంలో పూల నాగరాజును రెండో పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

దారి కష్టాలు!

- నిలిచిన ఎన్‌హెచ్ 340 పనులు
- గుర్రంకొండలో పెండింగ్‌లో డ్రైనేజి పనులు
- రెండేళ్లుగా పూర్తికానీ లింకు రోడ్లు



ఇందిరమ్మ కాలనీ వద్ద దెబ్బతిని పూడుకుపోతున్న కాలువలు

గుర్రంకొండ: జాతీయ రహదారి 340 పనులు ఆగిపోయాయి. రెండుళ్లుగా పట్టణంలో హైవే నుంచి ప్రధాన వీధులకు పెండింగ్‌లో ఉన్న లింకు రోడ్లు నిర్మాణ పనులు ఇంతవరకు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బస్టాండు పరిధిలో ఎన్‌హెచ్ 340 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చేపట్టి మురుగునీటి కాలువల నిర్మాణ పనులు కొన్ని చోట్ల పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. రహదారి వెంబడి అక్కడక్కడ మురుగునీటి కాలువలు నిర్మించలేదు. మురుగునీటితో పాటు వర్షపునీరు బయటకు వెళ్లే మార్గంలేక ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో కడప-బెంగుళూరు జాతీయ రహదారి మురుగునీటి మయంగా మారింది. దుకాణాల ఎదుట కాలువ నిర్మాణ కోసం తవ్వేసి వదిలేయడంతో వినియోగదారులు వేళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.

దెబ్బతిన్న మురుగునీటి కాలువలు

పట్టణంలోని పలు చోట్ల ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన మురుగునీటి కాలువలు దెబ్బతిని కూలిపోయాయి. స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్లో రెండు చోట్ల కాలువ పైకప్పు దెబ్బతిని పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. స్థానిక నవాజ్ సినిమాహాల్ పరిసరాల్లో రెండుచోట్ల కాలువ దెబ్బతిని పెద్ద ఎత్తున రంధ్రాలు ఏర్పాడ్డాయి. పట్టణంలో పలుచోట్ల కాలువలపై ఇదే పరిస్థితి నెలకొంది.

పూర్తి కాని లింకురోడ్లు

ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి నుంచి పట్టణంలోని పలు వీధులను కలుపుతూ గతంలో లింకురోడ్లు వేయడానికి పనులు చేపట్టారు. అయితే రెండేళ్లుగా పనులను నిలిపేశారు. దీంతో రోడ్లు మొత్తం కంకర తేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. లింకు రోడ్డు పనులు పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మల్లా విద్యుత్ స్తంభాలు

హైవే నిర్మాణ పనుల్లో భాగంగా గుర్రంకొండ పట్టణంలో సుందరీకరణ కోసం మూడేళ్ల కిందట రోడ్డు కిరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వీటి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నాటకుండా రోడ్లపక్కనే పడేశారు. మరికొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా విద్యుత్‌లైట్లు ఏర్పాట్లు చేయలేదు. దీంతో రెండుకిలోమీటర్ల మేరకు రోడ్డుకిరువైపులా ఖాళీ విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మల్లా నేటికి దర్శనమిస్తున్నాయి.



మార్కెట్‌యార్డు సర్కిల్లో దెబ్బతిన్న మురుగునీటి కాలువ పైకప్పు

చర్యలు తీసుకొంటాం

గుర్రంకొండ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజి పనులు కూడా త్వరగా పూర్తి చేయిస్తాం. కొద్దిరోజులుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సబ్ కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తాం. – వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్ 340 ఏఈ, మదనపల్లె

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



మాట్లాడుతున్న ఏపీ సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: వయోవృద్ధుల ఆస్తులను పిల్లలకు రాసిచ్చినా వారి తల్లిదండ్రులను సరిగా సంరక్షించకపోతే ఆ ఆస్తులను తిరిగి తల్లిదండ్రులకు చెందేలా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల సీనియర్ సిటిజెన్స్ హర్షం ప్రకటించారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. మొదట స్వామి వివేకానేంద జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను కొనియాడారు. ముందుగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. వయోవృద్ధులను పిల్లలు సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ అన్నారు. పలువురు సీనియర్ సిటిజెన్స్ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఐసీఐసీఐ బ్యాంకు అధికారులు ఫేసియల్ యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేశారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ గౌరవ అధ్యక్షులు వై.ఎస్.మునిరత్నం, గొల్లపూడి తిరుపతి రావు, శ్రీనివాసులు, టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి, తిమ్మయ్య, రామచంద్రయ్య, జగన్‌మోహన్,ధనలక్ష్మి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు రూరల్ :. స్థానిక నాగిరెడ్డి కళ్యాణమండపంలో ఆదివారం రొంపిచెర్ల మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అహమ్మద్‌బేగ్ కుమార్తె మొగల్‌నగ్మాసుల్తానా బేగం, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ ఉమర్‌హసన్‌ల వివాహ వేడుకకు మాజీ మంత్రి, పుంగనేరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి హాజరై నూనత వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మాజీ మంత్రివెంట పీలేరు సర్పంచ్ హబీబ్‌బాష, వైఎస్సార్‌సీపీ నాయకులు చెంచురెడ్డి, మహబూబ్ బాష, నిజాంఅలీబేగ్, ఇంతియాజ్‌ఖాన్, నాగభూషణం, విక్టరి వెంట్రమణరెడ్డి తదితరులు ఉన్నారు.

కుల వ్యవస్థను నిర్మూలించాలి

భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు శివప్రసాద్



కుల దహనానికి సంఘీభావం తెలుపుతున్న బాస్ సభ్యులు

మదనపల్లె : భారతీయ సమాజంలో కుల, వర్ణ, జెండర్ అసమానత్వానికి మూల కారణమైన కులవ్యవస్థను నిర్మూలించాలని భారతీయ అంబేద్కర్‌సేన వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. బాస్ 13 వ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కాలనీగేట్ సమీపంలోని అంబేద్కర్ ప్రాంగణంలో 'కుల దహనం' కుల నిర్మూలన చైతన్య సభ ను నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆలపించిన కులదహనం పాటలు, కర్ణాటక నృత్యబృందం ప్రదర్శించిన నృత్యాలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా సభకు హాజరైన ముఖ్యఅతిథులు మాట్లాడుతూ కులం పునాదుల మీద ఒక జాతిని, నీతిని కానీ నిర్మించలేరు' అన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానం ప్రకారం ఆయన మనుస్మృతి అసమానత్వాన్ని 1927 లో దహనం చేసినట్టే 'చాతుర్వర్ణ'అసమానత్వ చిహ్నాన్ని నేడు దగ్ధం చేస్తు న్నామన్నారు. సుప్రసిద్ధ రచన 'కుల నిర్మూలన'లో 'మీరు ఏదిక్కుకి వెళ్లినా మిమ్మల్ని కులం అనే భూతం వెంటాడుతుందని' చెప్పిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సూచించిన చూపుడువేలు బాటలో భారతీయ అంబేద్కర్ సేన తన 13 సంవత్సరాల ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా కులవ్యవస్థ, చాతుర్వర్ణ వ్యవస్థకు ప్రతీకగా ఉన్న బొమ్మను సభికులు దగ్ధం చేశారు. కార్యక్రమం లో జానపద అకాడమి గొల్లపల్లి శివప్రసాద్, బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, మొండెం శ్రీనివాసులు, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కన్వీనర్ గణపతి, బాస్ రాష్ట్ర కార్యదర్శి రమణ, పల్లం తాతయ్య, కోశాధికారి రమణ, జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, మైనార్టీ నాయకులు పీర్ బాష, కృష్ణ, రవికిరణ్, నూరి, జన, బాస్ సభ్యులు పాల్గొన్నారు.

కలికిరిలో మెగా శాఖాహార ర్యాలీ



శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యాన మాస్టర్‌లు

కలికిరి: మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలోని పిరమిడ్ జేతవనం ధ్యాన ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మెగా శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖాహార ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరు శాఖాహారులుగా మారి సంపూర్ణ ఆరోగ్య వంతులు కావాలని ధ్యాన మాస్టర్లు కోరారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, శాఖాహార ఉపయోగాలపై కరపత్రాలు పంచిపెట్టారు. పిరమిడ్ జేతవనం నిర్వాహకులు ప్రభాకర్, ధ్యాన మాస్టర్లు భాస్కర్ రెడ్డి, రాజేశ్వర్‌పూల, శోభారాణి, వీరన్న, చంద్రోశేఖర్, కామేశ్వరి, లక్ష్మీ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు

కొటాల వద్ద గల పిరమిడ్ జేతవనం ధ్యాన ఆశ్రమంలో మూడు రోజుల పాటు సంక్రాంతి మహా ధ్యాన యజ్ఞం సంబరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రభాకర్ తెలిపారు.

రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు

మదనపల్లె : సంక్రాతి పండుగ సందర్భంగా పట్టణం, గ్రామాల్లో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని సీఐలు ఎరీషావలీ, కళావెంకటరమణ తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ... పండుగ సందర్భంగా జూదకార్యకలాపాలు నిషేధమన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను కుటుంబసభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. అలాకాకుండా, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించి, జైలు పాలు కావద్దన్నారు. ఎక్కడైనా జూదం, కోడిపందేలు జరుగుతుంటే 100 లేదా 112కు లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9440796742 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

బి.కొత్తకోట: మండలంలో ఎక్కడైనా నిషేధిత కోడిపందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ జీవన్ గంగనాథబాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో కోడి పందేలు ఎక్కడెక్కడ నిర్వహించారు అన్న సమాచారంతోపాటు మళ్లీ ఎక్కడ నిర్వహిస్తారన్న దానిపై నిఘా పెట్టామని తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

పెద్దతిప్పసముద్రం: సంక్రాంతి సందర్భంగా మండలంలో ఎవరైనా కోడి పందేలు, పేకాట వంటి జూదామాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ జూదాలు నిర్వహించే గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు.

14న మకర జ్యోతి దర్శనం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అయ్యప్ప నగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14వతేదీ మకరజ్యోతి దర్శనం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆలయం ఉదయం గణపతి హోమం, అష్టాభిషేకం ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. స్వామి తిరు ఆభరణాల పెట్టెలతో పట్టణ పురవీధుల్లో చెక్కభజనలు, కోలాటలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. అయ్యప్పమాలాధారులకు ఇరుముడుల చెల్లింపు కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు తెచ్చిన నెయ్యితో అష్టాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తులకు మకరజ్యోతి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. .కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మార్పూరి సుధాకర్‌నాయుడు, జర్మనీరాజు, రమణరావు, బాలుస్వామి,విజయలక్ష్మి భాస్కర్, పోస్టాఫీసు రమణ, కేశవ, రవి, హేమంత్ పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రజల జీవితాలలో కొత్త వెలుగులు నింపాలి



పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): సంక్రాంతి ప్రజల జీవితాలల్లో కొత్త వెలుగులు నింపాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతిని పురష్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అని, ఈ శుభ సందర్భాన ప్రజలు ఆనందోత్సాహాల మధ్యన సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంటా భోగి భాగ్యాలు కలగాలని, ప్రజలందరి జీవితాల్లో మకర సంక్రాంతి వెలుగులు, సిరులు వెల్లివిరియాలను ఆయన ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం

గుర్రంకొండ: మండలంలోని నడిమికండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దక్షిణపు వెంకటరమణ, ఇదే పంచాయతీ మొటుకు గ్రామానికి చెందిన తిరుపల్లి వెంకట సుబ్బమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పర్యటించి వారి మృతదేహాలకు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మొటుకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రఘునాథ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. వారి ఇంటికి వెళ్లి వారికుటుంబ సభ్యులకు పరామర్శించారు. అలాగే నడిమిఖండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వట్టం చెంగా రెడ్డి ఆనారోగ్యంతో బాధపడతున్న విషయం తెలుసుకొని ఆయన స్వగృహంకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్, మాజీ ఆర్బీకే చైర్మెన్ జయచంద్రా రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, ఆప్పల్ల, సర్పంచ్‌లు నాగేంద్ర, జగన్మోహన్, ఎంపీటీసీ బాబయ్య పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

కలకడ : 27సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కలకడ మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1997-98 సంవత్సరంలో 10వ తరగతి చదివిన వారంతా ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాలలో నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారి గురువులకు సన్మానం చేసి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాలకు రూ.50 వేల విలువ చేసే కూలింగ్ ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అప్పటి ఉపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, రెడ్డెప్పనాయుడు, నాగభూషణం, భారతిలను ఘనంగా సత్కరించారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే




వివేకానంద జయంతి సందర్భంగా డైరీలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతా చాటిన స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తి మంత్రాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలో పలుచోట్ల వేడుకలు నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలో వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. తన బోధనలతో యువతలో చైతన్యాన్ని నింపిన మహనీయుడు వివేకానందుడని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. సొసైటీ కాలనీ డాక్టర్.వైఎస్సార్ పార్కు సమీపంలోని వివేకానంద విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉన్నదని, 100 ఏళ్లకు పూర్వమే చాటిచెప్పిన దార్శనికత స్వామి వివేకానందునిది అంటూ కొనియాడారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు ఉన్న యువకులను ఇస్తే ఈ దేశాన్ని మార్చి చూపిస్తానన్న మహాద్రష్ట వివేకానందుడన్నారు. అనంతరం వివేకానంద ఆశయం అసోసియేషన్ ఫౌండేషన్ టీమ్(వీఏఎఫ్) డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బండి ఆనంద్, జబ్బల శ్రీనివాసులు, వి.నారదరెడ్డి, నరేంద్రబాబుమాదిగ, అప్పినపల్లెభాస్కరాచారి, హిందూచైతన్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బండిబాలాజీ, నరిబాబాయ్, డీఆర్.జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అఖిలభారతీయ విద్యార్థిపరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో జరిగిన 162వ స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో విజయభారతి డాక్టర్.ఎన్.సేతు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివేకానందుడి ఆశయాలను నెరవేర్చే దిశగా ఏబీవీపీ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయి హితేష్, కిషోర్, రెడ్డిప్రసాద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్ధిక్ అన్నారు. ఆదివారం జిల్లా ఆస్పత్రి ఆవరణలోని వివేకానంద విగ్రహానికి పెయింటింగ్ చేసి, అందంగా తీర్చిదిద్ది నివాళులు అర్పించారు. పట్టణంలోని సొసైటీ కాలనీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం(ఆపస్) కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రెడ్డిశేఖర్, రమణారెడ్డిల ఆధ్వర్యంలో వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానందుడు కలలు గన్న భారతావని నిర్మాణం యువతతోనే సాధ్యమవుతుందని, ప్రపంచంలోనే ఏ దేశానికి లేని యువసంపద భారతదేశానికి ఉందని, ఇది సక్రమంగా ఉపయోగపడినప్పుడే స్వామి వివేకానంద ఆశయాలు సాకారమవుతాయన్నారు.

సర్వజన బోధనాసుపత్రి ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోం

– బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్



మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి ఎదుట బీఎస్పీ, వామపక్షనాయకుల నిరసన

మదనపల్లె : పట్టణంలోని సర్వజన బోధనాసుపత్రిని ప్రైవేటీకరణ చేసి, పేదలకు వైద్యసేవలు దూరం చేయాలని చూస్తే ఊరుకోమని బహుజనసమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి ఎదుట బీఎస్పీ, సీపీఎం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... బోధన ఆసుపత్రి ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సొంత హెరిటేజ్ కంపెనీని కోట్ల రూపాయల లాభాల్లో నడిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను ఒకొక్కటిగా దివాలా తీయిస్తున్నాడని ఆరోపించారు. పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు మదనపల్లె రాజకీయ భిక్ష పెడితే, మదనపల్లె మెడికల్ కాలేజ్, ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి రెండింటినీ ప్రైవేటుపరం చేస్తూ పేదప్రజల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. వందేళ్లకు పైగా నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటుపరం చేయడాన్ని కూటమిప్రభుత్వం మానుకోవాలన్నారు. ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యులను, సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చెయ్యడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైద్య సిబ్బందిని ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మదనపల్లి మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీలు ఉద్యమానికి సిద్ధమవుతుంటే, ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తలు వెలువడటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హరీంద్రనాథ్‌శర్మ, బిఎస్పీ నాయకులు రమణ, బాలాజి, చంద్ర, శివ, అరుణ్, అనిల్, రెడ్డి, మహేష్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ సంక్రాంతి



మదనపల్లె సిటీ: సంక్రాంతి అంటేనే ఇంటింటా సంతోషం..బంధుజనంతో గ్రామాలకు కళ వస్తుంది. ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లు, ఉద్యోగాలు చేస్తున్నావారు ఈ పండుగకు నెల రోజుల ముందు నుంచే టికెట్లు బుక్ చేసుకొని పల్లెబాట పడతారు. ప్రధానంగా మదనపల్లె పరిసర ప్రాంతాల పల్లెలు వ్యవసాయమే జీవనాధారం. ఎటుచూసినా పశుసంపద ఉండేది. ఇందు వల్ల ప్రతీది ప్రకృతి సహజసిద్ధంగా లభించేంది. ఇప్పుడంతా ఆధునిక యుగం. దీనికి తోడు ప్రతి ఒక్కరిది ఉరుకులు పరుగుల జీవనం. దీంతో సంక్రాంతి వంటి పెద్ద పండుగను రెడీమేడ్ వస్తువులతో జరుపుకోవాల్సి వస్తోంది.

కనిపించని గొబ్బిపాటలు

గొబ్బియళ్లో, గొబ్బియళ్లో.. అంటూ ఇళ్ల ముందు గొబ్బిపాటలు పాడే వారు కనుమరగయ్యారు. మదనపల్లె మండలం గొల్లపల్లి గ్రామంలో గొబ్బిపాటలు పాడే వారు ఉన్నారు. కాల క్రమేణా వీరు కూడా తగ్గిపోయారు.

పేడకు బదులు రంగు పౌడర్

ఒకప్పుడు ఇంటి ముంగిట పేడనీళ్లు చల్లి ముగ్గులు వేసేవారు. ప్రస్తుతం పశుసంపద తక్కువ అయినందున మదనపల్లె పట్టణంలో రంగు పౌడర్ అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక రోజుకు సరిపోయే పాకెట్ కేవలం ఐదు రూపాయలు మాత్రమేకావడంతో అనేక మంది పేడ నీళ్ల కలర్ పౌడర్‌తో తమ ఇంటి లోగిళ్లను అలంకరించుకుంటున్నారు. అలాగే ముగ్గుకు బదులు ముగ్గుపిండి, ఇసుకలో కలిపిన రంగులు సైతం రెడీమేడ్‌గా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి.

ముత్యాల ముగ్గులు

సంక్రాంతిని తెలుగువారు పెద్ద పండువగా భావిస్తారు. ముగ్గులు లేని సంక్రాంతిని ఊహించలేం. ముగ్గులన్నా, ముగ్గులు వేయడమన్నా ఇష్టపడని మహిళలుండరు. తీరిక వేళల్లో తమ సృజన, నైపుణ్యాలను ప్రదర్శిస్తూ రంగు రంగుల ముగ్గులను తళుకుమనిస్తుంటారు. సంక్రాంతికి ముందుగానే పట్టణంలో పలు సంస్థలు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.